


# మన తెలుగు తల్లికి 'సీపీ బ్రౌన్' పుస్తకహారం

కృష్ణలంక, న్యూస్‌టుడే:

ఆదరణ తగ్గుతున్న తెలుగు భాషా, సంస్కృతులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రారంభమైన సీపీ బ్రౌన్ అకాడమీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. తెలుగును సులభంగా నేర్చుకోవటానికి ఉపకరించే పుస్తకాలతో పాటు, తెలుగు జాతిలో పేరొందిన వ్యక్తుల చరిత్రలు, ప్రాచీన తెలుగు సాహిత్యానికి సంబంధించి ప్రముఖుల రచనలను ముద్రించి తెలుగు భాషాభిమానులకు అందిస్తోంది. పుస్తక మహోత్సవంలో భాగంగా సీపీ బ్రౌన్ అకాడమీ స్టాలును తొలి సారిగా ఇక్కడ ఏర్పాటు చేశారు. అనేక విశేషాలున్న స్టాలు, తెలుగు సంస్కృతికి కాపాడటానికి సంస్థ చేస్తున్న కార్యకలాపాల వివరాలు.

ఈ అకాడమీని ఆల్ఫా ఫౌండేషన్ అనే సంస్థ 2007లో హైదరాబాద్‌లో ప్రారంభించగా.. తెలుగు వారికి భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని తెలియచేయటం లక్ష్యంగా ముందుకు సాగుతోంది. తెలుగు భాషాజ్ఞానం పెంచటానికి సులభంగా, సరళంగా బోధనా ప్రణాళికలు ఏర్పాటు చేయటంతో పాటు, తెలుగు భాషలో ఉన్న పుస్తకాలన్నింటినీ, పత్రికలను, పరిశోధన గ్రంథాలను సేకరించి కంప్యూటరీకరణ చేయటంలో కృషి చేస్తోంది.

✦ ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఉంటున్న తెలుగు పిల్లలు తెలుగు చదవటం, రాయటం నేర్చుకోవటానికి స్వయం శిక్షణకు వీలుగా శాస్త్రీయ పద్ధతిలో, తెలుగులో రోమన్ లిపితో సహా వర్ణమాల, శబ్దమాల, వాక్యనిర్మాణం, తెలుగు సంభాషణ వాచకాలు ముద్రించారు.

✦ తెలుగు వాచకాలను అందరికి అందుబాటులోకి తేవటానికి వెబ్‌సైట్‌లో ఉంచారు



మనుసంభవం పరిచయం, ఆముక్త మాల్యద, తెలుగు పరిశోధన వ్యాస మంజరిలు గ్రంథాలు ఈ స్టాల్లో దొరుకుతున్నాయి.




✦ తెలుగు సాహిత్య విషయాల్లో పరిశోధనలు జరిగే విశ్వ విద్యాలయాన్నింటి నుంచి ఆయా పరిశోధనల వివరాలు సేకరించి త్రైమాసికసంకలనం విడుదల చేసే సన్నాహాల్లో ఉన్నారు.



**తెలుగు వారి కోసం :** తెలుగు నేర్చుకోవటం కోసం ఎనిమిది పుస్తకాలు, సీడీ కలిగిన బాల శిక్షణ కిట్ రూ.445కు విక్రయిస్తున్నారు. తెలుగులోని రకరకాల పదాలు ఉన్న పట్టిక కలిగిన శబ్దమాల, వాక్యం రాయటం చెప్పే వాక్య నిర్మాణం పుస్తకాల్లో లభిస్తున్నాయి. వీటితోపాటు చిన్న చిన్న సంభాషణలతో కూడిన తెలుగులో మాట్లాడుకుందాం, సామెతలు, సీడీలు కూడా విక్రయిస్తున్నారు.



### తెలుగు జాతి రత్నాలు

తెలుగు వారిలో పేరుగాంచిన అడుసుమిల్లి శ్రీనివాసరావు, దుర్గాబాయి దేశ్‌ముఖ్, వావిళ్ళ రామస్వామి శాస్త్రి వంటి వారి జీవిత చరిత్రలు కూడా ముద్రించారు.